తొర్రూరు రహదారిలో అనుమానిత వ్యక్తుల నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ సీట్ సాధించిన విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 274 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 28 సెప్టెంబర్ 2026


## పట్టాలు ఎక్కిన తొలి ఎల్ఎన్జీ రైలు

**- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా డ్యూయల్ ఫ్యూయల్ సాంకేతికత**




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో మొట్టమొదటి ఎల్ఎన్జీడీజిల్ డ్యూయల్ ఫ్యూయల్ డెము రైలు ఆదివారం పట్టాలెక్కింది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ఈ రైలును అభివృద్ధి చేసింది.గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జెండా ఊపి రైలును ప్రారంభించారు.

మిగతా2లో...

## యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

**- పలు జిల్లాల్లో వరద పరిస్థితి.. వెయ్యికి పైగా ఇళ్లకు నష్టం**



**లక్నో,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు, ఈదురు గాలులకు సంబంధించిన ఘటనల్లో శుక్రవారం నుంచి 56 మంది మృతి చెందగా, 46 మంది గాయపడ్డారు.భారీ వర్షాలతో రహదారులు, గ్రామాలు నీట మునిగాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిగతా2లో...

## ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

**- సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు.. ఉగ్రవాదానికి దీటైన సమాధానం ఇస్తామని స్పష్టం**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని మోదీ స్పష్టం చేశారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద చర్యలకు పాల్పడితే బలమైన, నిర్ణయాత్మక సమాధానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం

మిగతా2లో...

# కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లపై జిసిడిఓ భర్త పెత్తనమా...?

**జీసీడీవో గాయత్రి భర్త వాయిస్ రికార్డింగ్ వైరల్.. "నేను రిపోర్టర్‌ను.. చాలా విషయాలు తెలుసు" అంటూ వ్యాఖ్యలు?**

**అయనకు అధికారం ఇచ్చింది ఎవరు ..? ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్**



**మహబుబాబాదు, సెప్టెంబర్ 27(పిసిడబ్లూ న్యూస్ ప్రతినిధి) :** మహబూబాబాద్ జిల్లా లో ఓ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) నిర్వహణలో పనిచేస్తున్న మహిళా స్పెషల్ ఆఫీసర్ తో జీసీడీవో భర్త ప్రభాకర్ మాట్లాడినట్లు పేర్కొంటున్న వాయిస్ రికార్డింగ్ మహబూబాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీసీడీవోగా గాయత్రి విధులు నిర్వహిస్తుండగా.. ఆమె భర్త ప్రభాకర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో ఏ హోదాలో, ఏ అధికారంతో రాత్రి పూట గంటల తరబడి వాట్సాప్ కాల్ మాట్లాడారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.తాను "మహబూబాబాద్ జిల్లా ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్‌ను.. నాకు చాలా విషయాలు తెలుసు.. అయినా నేను వదిలేస్తున్నాను" అంటూ మాట్లాడినట్లు పేర్కొంటున్న వాయిస్ రికార్డింగ్ ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా మహిళా స్పెషల్ ఆఫీసర్లతో అధికారిక హోదా లేని వ్యక్తి సుదీర్ఘంగా మాట్లాడటం, వారికి సూచనలు లేదా హెచ్చరికల తరహాలో మాట్లాడినట్లు రికార్డింగ్‌లో ఉన్నట్లయితే.. దాని వెనుక ఉన్న అధికార సంబంధం ఏమిటన్నది తేలాల్సి ఉంది. **భర్తకు అధికారమిచ్చింది ఎవరు?** జీసీడీవోకు మిగతా2లో...

## భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

**● 8 వేల ఎకరాల వ్యవహారంపై ఆధారాలు బయటపెట్టాలి.. సిరిసిల్ల పర్యటనలో రాజకీయ విమర్శలకు కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు (కేటీఆర్) ఆయనకు బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలపై ప్రభుత్వం పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే 2,400 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న నేపథ్యంలో ఆ భూములకు సంబంధించిన మండలం, గ్రామం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను

మిగతా2లో...




## ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

**- వివాదం నేపథ్యంలో ఉత్తర్వులు ఉపసంహరించుకున్న తమిళనాడు ప్రభుత్వం**

**చెన్నై, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడులో పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ సెప్టెంబరు 21న జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉపసంహరించుకుంది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) కింద శాంతిభద్రతల విభాగాన్ని 'ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్'గా పేర్కొంటూ మినహాయింపు ఇచ్చారు. దీనిపై పలు వర్గాల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.ఈ విభాగం మత, మిగతా2లో...

## నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

**-రూ.5 లక్షల బీమా సౌకర్యం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రజలకు మరింత భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు నెలకు ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని మిగతా2లో...

## 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**- వచ్చే ఏడాది 2.5 లక్షల మందితో గిన్నిస్ రికార్డు లక్ష్యం**




## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

**- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు రాజ్యాంగ సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉన్నాయంటూ విమర్శ**



# ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసారమైన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ప్రస్తావిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 2016 సెప్టెంబరు 2829 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖను దాటి ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిందని మోదీ గుర్తుచేశారు. ఉరీలోని సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. సర్జికల్ స్ట్రైక్స్ భారత ఉగ్రవాద వ్యతిరేక విధానంలో కొత్త దిశను ప్రపంచానికి చూపించాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు పదేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో మోదీ ఈ విషయాలను ప్రస్తావించారు. గత దశాబ్దంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసిందని మోదీ అన్నారు. 2019లో బాలాకోట్ వైమానిక దాడి, 2025లో ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ఉగ్రవాదులు భారత్‌పై దాడికి పాల్పడితే దీటైన ప్రతిస్పందన ఉంటుందనే సందేశాన్ని ఈ చర్యల ద్వారా ఇచ్చినట్లు మోదీ పేర్కొన్నారు. మునుపటి సంవత్సరాల్లో దేశం ఎదుర్కొన్న ఉగ్రదాడులను కూడా ప్రధాని గుర్తుచేశారు. 2008 సెప్టెంబరు 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లు, అనంతరం జరిగిన ముంబై 26/11 ఉగ్రదాడులను ప్రస్తావించారు. ఉగ్రవాదం కారణంగా దేశం చాలాకాలం తీవ్ర నష్టాన్ని చవిచూసిందని పేర్కొంటూ, ప్రస్తుత విధానం ఉగ్రవాదానికి గట్టి సమాధానం ఇవ్వడంపై దృష్టి సారించిందని తెలిపారు. **జనగణనలో ప్రజల భాగస్వామ్యం** 'మన్ కీ బాత్'లో జనగణన అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు.

జనగణనను జాతీయ బాధ్యతగా పేర్కొన్న ఆయన.. ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ స్వీయ గణన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. **పర్యావరణం, యువతపై ప్రస్తావన** పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం, యువత, క్రీడలు, సాంస్కృతిక వారసత్వం వంటి పలు అంశాలను కూడా ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. అసోంలో పిగ్మీ హాగ్ సంరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను అభినందించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో యువత చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

# కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లపై జిసిడిఓ భర్త పెత్తనమా...?

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన కుటుంబ సభ్యుడు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడిందా? అధికారులు, సిబ్బందితో మాట్లాడేందుకు ఆయనకు ఏమైనా అధికారిక అనుమతి ఉందా? లేకుంటే ఏ ప్రాతిపదికన ఇటువంటి సంభాషణలు కొనసాగుతున్నాయి? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. "రిపోర్టర్‌ను.. చాలా విషయాలు తెలుసు" అంటూ మాట్లాడటం ద్వారా తన పాత్రను చాటుకునే ప్రయత్నం చేశారా..? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కేజీబీవీల్లో పనిచేస్తున్న మహిళా అధికారులపై వ్యక్తిగత ప్రభావం లేదా ఒత్తిడి ఉంటే.. అది పరిపాలనా వ్యవస్థకు తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పలువురు పేర్కొంటున్నారు. **ఒక్క రికార్డింగ్ మాత్రమేనా..?** జిల్లాలో ఇలాంటి వ్యవహారాలపై గతంలోనూ అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. అయితే వాటిలో వాస్తవాలు ఏమిటో, ఎవరి పాత్ర ఎంతవరకు ఉందో అధికారిక విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. ప్రస్తుతం బయటకు వచ్చిన వాయిస్ రికార్డింగ్‌పై కూడా సమగ్రంగా పరిశీలన జరిపి.. సంభాషణలో ఉన్న వ్యక్తులు ఎవరు, ఏ సందర్భంలో మాట్లాడారు, ఎలాంటి సూచనలు చేశారు అనే అంశాలను అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. **కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలి** కేజీబీవీలలో పనిచేస్తున్న మహిళా స్పెషల్ ఆఫీసర్లపై ఎలాంటి అనధికారిక జోక్యం ఉండకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఎస్పీడీ అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, జీసీడీవో గాయత్రి విధులపై కూడా సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో సంబంధిత అధికారుల వాదనను కూడా పరిగణనలోకి తీసుకుని పూర్తి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

# భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వెల్లడించాలని కోరారు. భూ ఆక్రమణలపై చేసిన ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ అన్నారు. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే ముఖ్యమంత్రి సిరిసిల్ల ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను ప్రజల ముందుంచాలని, భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్న ప్రక్రియలో పాల్గొన్న అధికారుల వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. **నేతన్నల బకాయిలపై ప్రశ్నలు** సిరిసిల్ల నేతన్నల సమస్యలపై కూడా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.60 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నేతన్నలకు గతంలో అమలు చేసిన రూ.5 లక్షల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, మూతపడిన చేనేత పార్కు కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరల పథకం నిలిచిపోవడం, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన ఆర్డర్లు తగ్గడం వల్ల నేతన్నలకు ఉపాధి అవకాశాలు తగ్గాయని ఆయన పేర్కొన్నారు. **రైతుల సమస్యలపైనా స్పష్టత కోరిన కేటీఆర్** సిరిసిల్ల నియోజకవర్గ రైతులకు సంబంధించిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబీమా అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని సుమారు 56 వేల మంది రైతులకు రూ.532 కోట్ల మేర పెట్టుబడి సాయం అందిందని ఆయన పేర్కొన్నారు.

ఎకరాకు రూ.15 వేల సాయం చేస్తామని ఇచ్చిన హామీ అమలు ఎప్పటి నుంచి జరుగుతుందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సిరిసిల్ల ప్రాంతానికి కొత్త పరిశ్రమలు, ఆక్వా హబ్, ఆహార శుద్ధి పరిశ్రమల మండలి వంటి ప్రతిపాదనల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని కోరారు. మల్కపేట జలాశయం నుంచి అప్పర్ మానేరు వరకు నీటిని తరలించే అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని పేర్కొన్నారు. **హామీల అమలుపై తేదీలు ప్రకటించాలి** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. మహాలక్ష్మి పథకం, పింఛన్ల పెంపు, రైతులకు సంబంధించిన హామీలు, దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన తేదీలను ప్రకటించాలని కోరారు.

సిరిసిల్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనలో స్థానిక సమస్యలకు సమాధానాలు ఇవ్వాలని, రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. భూ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తే, తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలను ఎదుర్కోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

# దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం

**పెండింగ్‌లోని యూఎల్‌సీ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు.. అర్హమైన కేసుల క్రమబద్ధీకరణకు చర్యలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కేసులను క్రమబద్ధీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ శాఖ మెమో నంబర్ 48062/ULC/A1/2026`1ను జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జీఓలు 455, 456, 747, 92 కింద దాఖలైన పెండింగ్ యూఎల్‌సీ దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం అర్హత ఉన్న కేసులను సంబంధిత నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ నిర్ణయంతో సంవత్సరాల తరబడి భూ హక్కులు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దరఖాస్తుదారులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది. 2016లోనే యూఎల్‌సీ సమస్యల పరిష్కారానికి అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



దీంతో వేలాది దరఖాస్తులు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఫలితంగా భూముల హక్కులు, లావాదేవీల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. **22-ఏ సమస్యలపైనా దృష్టి** భూ సమస్యలతో పాటు రిజిస్ట్రేషన్ చట్టంలోని 22-ఏ సెక్షన్‌కు సంబంధించిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 22-ఏకు సంబంధించిన పలు సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ఉత్తర్వులు జారీ చేసినట్లు పొంగులేటి చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ లేదా సంబంధిత పురపాలక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్న ఆస్తులు 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. యూఎల్‌సీతో పాటు మిగిలిన 22-ఏ సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అర్హత, పత్రాల పరిశీలన, చట్టపరమైన నిబంధనల ఆధారంగానే కేసులను పరిష్కరించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## పట్టాలు ఎక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు

(మొదటి పేజీ తరువాయి)

సబర్మతిమహేసన జంక్షన్ మధ్య ఈ రైలు నడవనుంది. 62 కిలోమీటర్ల దూరాన్ని సుమారు గంటా 20 నిమిషాల్లో చేరుకోనుంది. ఎల్ఎన్‌జీ అందుబాటులో లేని పరిస్థితుల్లో డీజిల్‌కు మారేలా ఈ రైలును రూపొందించారు. మొత్తం ఎనిమిది నాన్-ఏసీ చైర్‌కార్ కోచ్‌లు ఉన్నాయి. రైలును ప్రారంభించే ముందు 2 వేల కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయి ట్రయల్స్ నిర్వహించారు. ఎల్ఎన్‌జీ వినియోగంతో డీజిల్ వినియోగం, కర్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెయ్యికి పైగా ఇళ్లు దెబ్బతినగా, పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయక చర్యలు చేపట్టి, చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. వర్షాల తీవ్రత కొంత తగ్గినప్పటికీ పలు జిల్లాల్లో వరద పరిస్థితి కొనసాగుతోంది. సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.

## నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రైతులకు ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు.

ఇందిరమ్మ భీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

కుల ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసు కాల్పులు, కస్టడీ మరణాలు, పోలీసు వేధింపులు, నిర్బంధ కేసులు తదితర అంశాలకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలిస్తుంది. తాజా ఉత్తర్వులతో ఈ విభాగం ఆర్టీఐ పరిధిలోనే కొనసాగనుంది.

## 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు


**హైదరాబాద్,సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ జాగృతి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అన్ని జిల్లాలతో పాటు పలు దేశాల్లోనూ బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆదివారం బతుకమ్మ వేడుకల పోస్టర్, సంప్రదాయ బతుకమ్మ, చప్పట్ల పాటలతో రూపొందించిన సీడీని ఆమె ఆవిష్కరించారు. బతుకమ్మను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో బతుకమ్మ, కోలాటం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కవిత వెల్లడించారు. ఇప్పటికే పలు జిల్లాలు, దేశాల్లో కమిటీలను ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది సుమారు 2.5 లక్షల మందితో భారీ బతుకమ్మ వేడుకలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు కవిత తెలిపారు. గతంలోనూ బతుకమ్మను అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. అయితే వచ్చే ఏడాది నిర్వహించనున్న కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించేందుకు ప్రతిపాదించిన కార్యక్రమమేనని, రికార్డు ఇప్పటికే సాధించలేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ సంప్రదాయ పాటలు, చప్పట్ల పాటలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సీడీని కూడా విడుదల చేశారు. సంప్రదాయ కళలు, పాటలను పరిరక్షించడంతో పాటు మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నించడం, సీఈసీ రాజీనామా చేయాలని కోరడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేస్తోందని, ఓటమి ఎదురైనప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం ఏమిటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఏ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పనిచేయదని, ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కూడా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మృతుల పేర్లు, నకిలీ లేదా రెండుసార్లు నమోదైన పేర్లు, తప్పులున్న వివరాలను సరిచేయడం ఓటర్ల జాబితా శుద్ధీకరణలో భాగమని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోందని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరుపై కాంగ్రెస్ నేతలు ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సీఈసీని తొలగించాలని డిమాండ్ చేయగా, ఎన్నికల ప్రక్రియపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు అవసరమని ఆయన కోరారు. మరోవైపు, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వస్తున్న వార్తలను కిషన్‌రెడ్డి ప్రస్తావిస్తూ.. ఎన్నికల కమిషనర్లు పరస్పరం చర్చించుకోవడం, లేఖలు రాయడం సహజమైన ప్రక్రియేనని అన్నారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమావేశమై తమ మధ్య విభేదాలు లేవని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు అనవసర వివాదంగా మార్చకూడదని ఆయన అన్నారు.

## 'సర్'ను రద్దు చేయండి

- ఎన్నికల సంఘం పనితీరుపై దర్యాప్తునకు ఆదేశించండి
- సీజేఐకి 2 వేల మందికి పైగా పౌరుల బహిరంగ లేఖ




**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'సర్'లో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని 2 వేల మందికి పైగా పౌరులు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్‌కు ఇటీవల లేఖ రాశారు. 'సర్' విషయంలో న్యాయ వ్యవస్థ వెంటనే జోక్యం చేసుకోవాలని, సుమోటోగా స్వీకరించాలని కోరారు. సర్‌పై వెంటనే స్టే విధించి దాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ లేఖపై మాజీ రాజ్యసభ ఎంపీ జవహర్ సిర్కార్, ఆర్థికవేత్తలు జయతీ ఘోష్, కమల్ మల్హోత్రా, రిటైర్డ్ ప్రొఫెసర్లు ఆదిత్య, మృదుల ముఖర్జీ, ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ సంతకాలు చేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



**వరంగల్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ గోపాలస్వామి గుడి జంక్షన్‌లో ఉన్న బాపూజీ విగ్రహానికి కుడా చైర్మన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా సామాజిక న్యాయవేదిక ప్రధాన కార్యదర్శి, పెరక సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చ వినోద్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుడా చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన త్యాగాలు, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక న్యాయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సమాజంలో సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు బలపడాలని ఆయన ఆకాంక్షించారని గుర్తుచేశారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని, యువత ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ గుండు సుధారాణి, సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్, పెరక సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా హక్కును ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి..

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించాలి..

## తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 25 శాతం నిధులు కేటాయించాలి..





**కరీంనగర్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్య ప్రతి పౌరుడి హక్కు అని, నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉండాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. కరీంనగర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అభివృద్ధి, ఆకాంక్ష, ఆత్మగౌరవం, సమానత్వం, విద్యా హక్కు వంటి అంశాలపై చర్చించారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వంవిద్యఅభివృద్ధి సిద్ధాంతాల స్ఫూర్తితో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని సమావేశంలో కోరారు. ప్రైవేట్ విద్యా వ్యవస్థను ప్రభుత్వ పర్యవేక్షణలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించి, ఆ నిధులను పూర్తిగా విద్యాభివృద్ధికే వినియోగించాలని TUF డిమాండ్ చేసింది. విద్య ద్వారా సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని సమావేశంలో పేర్కొన్నారు."తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి విద్యా హక్కు ప్రతి ఉద్యమకారుడి హక్కు" అనే నినాదంతో విద్యారంగంలో సమూల మార్పుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ఫోరం ప్రతినిధులు తెలిపారు.

# ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు సర్వమానవాళికి ఆదర్శం

## జమాతే ఇస్లామీ హింద్ అఖిల భారత ఉపాధ్యక్షులు మౌలానా వలి ఉల్లాహ్ ఫాలహి






**కరీంనగర్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మహా ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు సర్వమానవాళికి ఆదర్శప్రాయమని, ఆయన చూపిన సన్మార్గాన్ని ఆచరిస్తే సమాజంలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జమాతే ఇస్లామీ హింద్ అఖిల భారత ఉపాధ్యక్షులు మౌలానా వలి ఉల్లాహ్ ఫాలహి అన్నారు.ఆదివారం కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం, బోధనలు మానవాళికి శాంతి, సోదరభావం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పే మార్గదర్శకాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మతాలు, సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని మత సామరస్యాన్ని, ఐక్యతను చాటారు. తెలంగాణ అధ్యక్షులు అజహరుద్దీన్, రఖీబ్ లతీఫీ, నయం ఉద్దీన్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శులు ఇమాదుద్దీన్, సోహెబ్ అహ్మద్ ఖాన్, కరీంనగర్ సిటీ అధ్యక్షులు డాక్టర్ ముస్తాక్, అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్, ప్రతినిధి వసీం అహ్మద్, వీజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఖైర్ ఉద్దీన్, షోయబ్ లతీఫీ, రఫీఖ్ అహ్మద్, పలువురు జమాత్ నాయకులు పాల్గొన్నారు.క్రైస్తవ సంఘం ప్రతినిధి రేవంత్ క్రిస్టోఫర్, శివాలయం పూజారి పురాణం మహేశ్వర్ శర్మలు పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ తదితర వర్గాలకు చెందిన సోదరసోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఘన నివాళులు...

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవితచంద్రశేఖర్ పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకున్నారు.తెలంగాణ సమాజం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం, త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఆయన ఆశ యాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.



# టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ సీట్ సాధించిన విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత



**తొర్రూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలోని టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ డాక్టర్ ఎస్ రామ్ నర్సయ్య సహకారంతో మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి ఆర్థిక సహాయం మరియు మెడికల్ కిట్ ను ఆదివారం అందజేశారు ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ డాక్టర్ ఎస్ రామ నరసయ్య ప్రసంగిస్తూ లయన్స్ క్లబ్స్ సేవే మార్గం సేవ లక్ష్యంతో పనిచేస్తాయని, ఈరోజు మెడికల్ సీట్ సాధించిన విద్యార్థికి ఉన్నత చదువుల కొరకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇల్లందుల శ్రీనివాస్, రీజియన్ జివిస్టి లీడర్ చింతల సురేష్, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ తోట రమేష్, లయన్ లీడర్స్ ముదుపు రవీందర్ రెడ్డి, వజినేపల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తొర్రూరు రహదారిలో అనుమానిత వ్యక్తుల నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు




**తొర్రూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు పట్టణంలో గత కొద్ది కాలం నుండి అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బీహార్, చత్తీస్గడ్, ఉత్తర ప్రదేశ్ ,మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి తెలంగాణకు అనేకమంది వ్యక్తులు వివిధ రకాల వ్యాపారాల కొరకు ఈ ప్రాంతాలకు వస్తున్నారని అలాగే ఇక్కడే కొందరు నివాసం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నట్లు సమాచారం. అదే తరహాలో ఆదివారం తొరూరు ప్రధాన రహదారిలో గల భద్రకాళి బార్ కు ఎదురుగా ఏర్పాటుచేసిన కాఫీ సెంటర్ ప్రాంతంలో ఇద్దరు కొత్త వ్యక్తులు ఉత్తరప్రదేశ్ కు చెందిన వారు మూడు గంటల నుండి అదే ప్రాంతంలో సంచరిస్తున్నట్లు పోలీసులకు ఆ ప్రాంతవాసులు సమాచార అందించారని విషయాన్ని అందుకున్న పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ ఆ ప్రాంతానికి వచ్చి నూతన వ్యక్తుల నుండి సమాచారాన్ని సేకరించారు. ఆ ప్రాంతంలో కొంత ఖాళీ స్థలం ఉండటం వలన అక్కడ ఓపెన్ గా బట్టల వ్యాపారం చేసుకునేందుకు ఆ ప్రాంత వాసులను అనుమతి కొరకు వేచి ఉన్నామని వారు పేర్కొన్నారు. తోరూర్ పట్టణంలో గంజాయి తరహా మత్తు పదార్థాలు అమ్మే వారు కూడా సంచరిస్తున్నారని ఎవరైనా కొత్త వ్యక్తులు అని అనుమానం వచ్చిన వారికి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రవీందర్ కోరారు ఆ ఇద్దరు వ్యక్తులు ఉత్తరప్రదేశ్ నుండి ఇక్కడికి వచ్చామని బట్టల వ్యాపారం చేసుకునేందుకు అనువైన ప్రదేశాన్ని చూస్తున్నామని వారు పేర్కొన్నారు. వారి వద్ద నుండి పూర్తి సమాచారం సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ళ పరిపాలనకు నిదర్శనం సేవా సంకల్ప అభియాన్

## - రక్తదానం శిబిరాన్ని ప్రారంభం చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్.




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా దేశానికి, ప్రజలకు అందిస్తున్న నిరంతర సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. 25 సంవత్సరాల ప్రజా సేవ పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్ లో బీజేవైఎం ఆద్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేశారు. అనంతరం రక్తదానం చేసిన పలువురు బీజేవైఎం నాయకులకు పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... మానవత్వంతో చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా బీజేవైఎం నాయకులు, యువకులు, మోడి అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గత 25 ఏళ్ల పాటు నరేంద్ర మోడీ అహర్నిశలు శ్రమిస్తూ... పని చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వం, మార్గనిర్దేశంలో భారతదేశం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధిస్తుందని తెలిపారు. నరేంద్ర మోడీ తిరుగులేని నాయకుడిగా 25 ఏళ్ళ పాటు ప్రజా సేవ ప్రపంచ దేశాలకు ఆదర్శం అన్నారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా యువత సామాజిక సేవలో ముందుండాలని పిలుపు నిచ్చారు. మోడీ సేవలను స్ఫూర్తిగా తీస్కోని... రక్తదానంతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి ప్రజలకు సేవలందించాలని పిలుపు నిచ్చారు. మోడి ఆశయాలను స్ఫూర్తిగా తీస్కొని బీజేవైఎం నాయకులు ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో కూడ నరేంద్ర మోడీ నాయకత్వంలో ఇలాగే ఎల్లప్పుడు కొనసాగేలా...దేశ ప్రజలకు మరింత సేవ చేసేలా భగవంతుడు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు. నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి బాట పట్టిందని... ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మోడి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ఇంకా అభివృద్ధి చేంది... గొప్ప ప్రగతిని సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, పొన్నం లక్ష్మీ మొండయ్య, మాసం గణేష్, గాజ రమ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బీజేపి నాయకులు గుజ్జు శ్రీనివాస్, అవదుర్తి శ్రీనివాస్, చంద్రమౌళి, ఆనంద్, శివరాజ్, గాయత్రి, శివకుమార్, పాల్గొన్నారు.



# ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

**- తొర్రూరు టీ జి ఎస్ ఆర్ టి సి బస్ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి వెల్లడి**

**- బస్టాండులో ప్రతి పిల్లర్ కు బస్సు ఎంక్వయిరీ నెంబర్ను ఏర్పాటు చేశాం**

**- అది ఇంగ్లీషులో ఉంది తెలుగులో రాయండి ఒక ప్రయాణికులు ఆవేదన?**










ఎంక్వయిరీ సెల్ నెంబర్ 7382926183 బస్సుల వివరాల కొరకు ఈ నెంబర్ ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఈ సెల్ ఫోన్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది..

**తొర్రూర్ ప్రతినిది, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటుచేసిన దగ్గర నుండి పురుషులకు బస్సు ఎక్కే వీలు లేకుండా అలాగే ఎక్కిన వారికి సీటు దొరకక అనేక అవస్థలు పడుతున్న విషయం అందరికీ విధితమే.వరంగల్ డివిజన్లోని తొర్రూరు టి జీఎస్ ఆర్టీసీ బస్టాండ్ లో అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు. ఇది మారుమూల ప్రాంతం కావడంతో అందుబాటులో ఎటు వెళ్లాలన్న ఆర్టీసీ బస్సు పైనే ఆధారపడి వెళ్లాల్సి ఉంటుంది దీనికి అనుకూలంగా రైల్వే లైన్ లేకపోవడంతో ప్రతి ఒక్కరు కూడా హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబాద్ ,ఎటు వెళ్లాలన్న బస్సు ప్రయాణమే చేయాల్సి ఉంటుంది . ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు కొందరికి ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ విషయాన్ని గతంలో దయల్ యువర్ డిఎం దృష్టికి తీసుకువెళ్లారని ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని తొర్రూరు టీ జిఎస్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బస్టాండ్ లోని ప్రతి పిల్లలకు బస్సు ఎంక్వైరీ నెంబర్ను ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు చేసినందుకు ప్రయాణికులు బస్సు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. మరి కొందరు మహిళలు ఇంగ్లీషులో ఉండటం వలన మాకు ఏమీ అర్థం కావడం లేదని తెలుగులో కూడా విచారణ సెల్ నెంబర్ రాస్తే బాగుంటుందని కొందరు మనసులోని భావాన్ని వ్యక్తం చేశారు. తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ లో బయలుదేరే ఆర్టీసీ బస్సు సర్వీసుల వివరాలను ఒకసారి గమనిద్దాం. ప్రతిరోజు ఉదయం 3:20 కి తొరూర్ నుండి మొదటి బస్సు ఎక్స్ప్రెస్ ఉప్పల్ ఎక్స్ రోడ్ కు బయలుదేరుతుంది. తొర్రూరు నుండి జగద్గిరిగుట్టకు చివరి బస్సు రాత్రి 7:30 కి వెళుతుంది.4. 20 కి ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు తొర్రూర్ బస్టాండ్ నుండి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. తొర్రూర్ నుండి సూపర్ లగ్జరీ చివరి బస్సు రాత్రి 7 గంటలకు వెళుతుంది. అలాగే ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు రాజధాని ఏసీ బస్సు ల వివరాలు మొదటి ఏసీ బస్సు7:15 నిమిషాలకు బయలుదేరుతుంది. తదుపరి 9:15 నిమిషాలకి అలాగే సాయంత్రం 3:15 నిమిషాలకి, చివరి రాజధాని 4. 15 నిమిషాలకు వెళుతుంది.తొర్రూర్ నుండి ఉప్పల్ ఎక్స్ రోడ్, జగద్గిరిగుట్ట వరకు ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని గమనించండి. ఇదే కాకుండా తొర్రూర్ నుండి దిల్ షుక్ నగర్ వయ మోత్కూరు వలిగొండ చౌటుప్పల్ ద్వారా ఈ బస్సు తోరూర్ లో పగలు 1.00 కు బయలుదేరుతుంది. మిగతా



బస్సులు వరంగల్ కు వెళ్లే ప్రయాణికుల కొరకు ఉదయం 5.00 గంటలకి పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సు కరీంనగర్ వరకు 5.15 నిమిషాలకి బయలుదేరుతుంది. వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు రాత్రి 9 గంటల వరకు ఉంటున్నాయి. ఇవే కాకుండా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, నర్సంపేట, జనగాం వైపు ఆర్టీసీ బస్సులు ఉదయం 5 గంటలకు ప్రారంభం కానున్నాయి. తొర్రూర్ బస్టాండ్ నుండి మహబూబాబాద్, నర్సంపేట, జగద్గిరిగుట్ట చివరి బస్సులు 7:30 కి తదుపరి ఈ రూట్ కి బస్సులు లేవని గమనించండి. ఏ ప్రాంతానికైనా సరే వెళ్లాల్సిన ప్రయాణికులు ఏ బస్సు ఎప్పుడు వస్తుంది తెలుసుకునేందుకు టీజీఎస్ఆర్టిసి తొర్రూర్ బస్టాండ్ లో ప్రతి పిల్లర్



## జమ్మికుంటలో ఘనంగా కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..

**రక్తదాన శిబిరం ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**

**జమ్మికుంట, సెప్టెంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ఉద్యమకారుడు, పద్మశ్రీ కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం: సాయిని మల్లేశం** ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. కోండా లక్ష్మణ్ బాపూజీ జీవితం దేశానికి, భావితరాలకు ఎనలేని స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన అడుగుజాడలు ప్రాతఃస్మరణీయమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన



పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. **సేవా సంకల్ప అభియాన్ బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ....** 'సేవా సంకల్ప అభియాన్' ప్రోగ్రాంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం లభిస్తుందని, యువత రాజకీయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలన సందర్భంగా నెల రోజులపాటు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తదనంతరం బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ప్రధాని మోదీ మన్ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి., జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, బైరెడ్డి వెంకట రమణారెడ్డి, పుప్పాల రఘు, నరసింహ రాజు, టంగుటూరి రాజ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండ లక్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాల నివాళులర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లో తెలంగాణ తొలితరం ఉద్యమం నేత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆద్వర్యంలో జరిగిన వేడుకలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాపూజీ దేశం, తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.... కొండ లక్మణ్ బాపుజీ చూపిన ఆశయాలు... త్యాగనిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకం అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో బాపూజీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసిన నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు వాసాల రమేష్, మాసం గణేష్, చొప్పరి జయశ్రీ వేణు, వేముల కవిత చంద్రశేఖర్, పద్మశాలి సంఘం నాయకులు మెతుకు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పదంగా మారిన చాకలి ఐల్లమ్మ జయంతి వేడుకలు

**కుల వివాదం కాస్త కాంగ్రెస్ వర్సెస్ బిజెపి గా మారిన వైనం..**

**ఇరు వర్గాల పై కేసులు నమోదు చేసిన పోలీసులు...**

**చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన జిల్లా రజక సంఘం నేతలు.**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని చిట్టెల్ల ఐల్లమ్మ చౌరస్తా వద్ద జరిగిన వీరనారి చాకలి ఐల్లమ్మ 131వ జయంతి వేడుకలు తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారితీశాయి. ఈ వేడుకలు కాస్తా కుల గొడవగా మారి, చివరికి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ రాజకీయ రంగు పులుముకుంది. ఘటనకు సంబంధించి బాధితులు, రజక సంఘం నాయకులు కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా శనివారం జరిగిన చిట్టెల్ల ఐల్లమ్మ జయంతి వేడుకలకు హాజరు కావలసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు సమయానికి రాకుండా నాలుగు గంటలు ఆలస్యంగా రావడం, అధికారికంగా నిర్వహించాల్సిన కార్యక్రమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం , జిల్లా అధికారులు అలసత్వం ప్రదర్శించారని , కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా అధికారిక కార్యక్రమంలా వేడుకలు నిర్వహించలేదని, మంత్రి పోన్నం ప్రభాకర్ కనీసం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మాట్లాడక పోవడం లాంటి విషయాలు రజకుల ఆగ్రహానికి కారణమైంది. ఈ సందర్భంగా రజక నేతలు అధికారుల వద్ద నిరసన తెలుపుతుంటే ఓ వ్యక్తి అనవసరంగా కలగజేసుకొని మాట్లాడడంతో గొడవ కాస్త ముదిరింది. రజక నేతలు అనవసరంగా వివాదం సృష్టించడానికి వచ్చిన వ్యక్తిపై చేయి చేసుకోవడంతో





ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసన సమయంలో వీరనారి చిట్టెల్ల ఐల్లమ్మను, రజక జాతిని వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, రజక యువ నేత మహేష్‌పై కొందరు దుండగులు భౌతిక దాడికి పాల్పడ్డారని కరీంనగర్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు రాచకొండ నరేష్ కరీంనగర్ పోలీసులకు ఆదివారం రోజున ఫిర్యాదు చేశారు. అలాగే చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాచకొండ నరేష్ మాట్లాడుతూ రజకులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, చాకలి ఐలమ్మ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించిన తీరు మమ్మల్ని తీవ్రంగా బాధించిందన్నారు. అంతేకాకుండా అనవసరంగా ఓ వ్యక్తి కలగజేసుకొని చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అగౌరవపరిచే రీతిలో వ్యవహారాలు చేస్తే , మా జాతి చూస్తూ ఊరుకుండలా అని ప్రశ్నించారు. అనవసరంగా జయంతి వేడుకల్లో కలుగజేసుకొని గొడవకు కారణమైన కాంగ్రెస్ నేత జెర్రిపోతుల వాసు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జయంతి వేడుకల్లో రజక సంఘం నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారని, ఈ వేడుక ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాకపోయినా, కాంగ్రెస్ , బిజెపి పార్టీల మధ్య గొడవ గా చిత్రీకరించడం భావ్యం కాదన్నారు. ముఖ్యంగా రజక జాతి టార్గెట్ గా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా నిన్నటి ఘటన పైన కాంగ్రెస్ చెందిన ఓ వ్యక్తితో ఎస్సీ అట్రాసిటీ చట్టం కింద రజక నేతలపై అక్రమ కేసులు పెట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ కేసును వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోకపోతే , రజకుల ఐక్యత , సత్తా ప్రభుత్వానికి చాటి చెబుతామని ఆయన హెచ్చరించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.




## పదవి త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**- టీడీపీ ఖమ్మం పార్లమెంట్ హడ్‌హక్ కమిటీ సభ్యుడు కేతినేని హరీష్‌చంద్ర**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ హడ్‌హక్ కమిటీ సభ్యుడు కేతినేని హరీష్‌చంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరీష్‌చంద్ర మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్న బాపూజీ తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ప్రజల హక్కులు, తెలంగాణ ప్రయోజనాల కోసం ఆయన నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం త్యజించిన ఆయన త్యాగం నేటి తరానికి ఆదర్శమన్నారు.చేనేత సహకార రంగం అభివృద్ధికి కూడా బాపూజీ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. సామాన్య ప్రజల జీవనోపాధి, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. యువత బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రావెళ్ల అనంతరామయ్య, చల్లగుండ్ల రమేష్, నరసింహారావు, బానోత్ శ్రీనివాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# త్యాగమే ఊపిరిగా.. బాపూజీ జీవితం


**- బాపూజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల హక్కుల కోసం బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజాసేవకు ప్రాధాన్యత ఇచ్చిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం, బిచ్చాల తిరుమలరావు, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, కసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో ఘనంగా పౌర్ణమి యజ్ఞం..





**కరీంనగర్, సెప్టెంబర్27(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో భాద్రపద పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించగా, బ్రాహ్మణులు అభిషేక్ ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ తదితరులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి యజ్ఞం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు ధార్మిక చింతన పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు. విద్యతో పాటు సంస్కారం, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళాదేవి, ఎలగందుల సత్యనారాయణ, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాపూజీకి భారతరత్న ప్రకటించాలి: పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య



**గోపాల్‌రావుపేట, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అలువాల విష్ణు డిమాండ్ చేశారు. బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం గోపాల్‌రావుపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు చేనేత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాపూజీ విశేష కృషి చేశారని అన్నారు. ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనతో కార్యకర్తల్లో జోష్.. ఇక కాస్కో కేటీఆర్!

**- రూ.60 కోట్లతో నూతన కలెక్టరేట్ ప్రారంభం**




**కరీంనగర్, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో కరీంనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజల్లో కొత్త ఉత్సాహం వస్తుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రూ. 60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. సుడా నిధులతో రహదారి, హెలిప్యాడ్, గార్డెన్లు, సింథటిక్ వాకింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. బీజేపీ నేతల తీరుపై విమర్శలు చేసిన ఆయన.. కేబుల్ బ్రిడ్జి లైటింగ్, ఆర్వోబీ పనుల జాప్యంపై పలు ఆరోపణలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానిస్తూ.. "ఇన్నిరోజులు ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క.. ఇక కాస్కో కేటీఆర్" అంటూ సవాల్ విసిరారు.

# రైతన్నను కంటిపాపలా కాపాడుకుందాం

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు**

**- పైప్‌లైన్ పనులతో దెబ్బతిన్న పంటలకు రూ. 50,000 నష్టపరిహారం!**

**- స్వేదం చిందించే కర్షకుడి కష్టానికి వెలకట్టలేం.. కానీ ఆపదలో అండగా నిలవడం సమాజ బాధ్యత!**





**ఖమ్మం ప్రతినిధి (పిసిడబ్ల్యూ న్యూస్):** మట్టినే నమ్ముకుని, ఎండనకా వాననకా రక్తాన్ని చెమటగా మార్చి నాటువేసే ప్రతీ రైతు ముఖంలో చిరునవ్వు చూడటమే నిజమైన సమృద్ధి. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం మునగాల కృష్ణాపురం గ్రామంలో జవహర్ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ మరమ్మతు పనుల కారణంగా పంట నష్టపోయిన పత్తి రైతులకు ఎకరానికి రూ. 50 వేలు నష్టపరిహారం అందిస్తున్నట్లు ప్రాజెక్టు నిర్వాహకులు ప్రకటించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు అన్నారు. ఆదివారంనాడు దెబ్బతిన్న పొలాలను స్వయంగా పరిశీలించి, కష్టాల్లో ఉన్న కర్షక కుటుంబాలకు అధికారులు అండగా నిలిచారు. నేల తల్లిని నమ్ముకున్న రైతుకు చిన్న కష్టం వచ్చినా అది సమాజానికే లోటు. అభివృద్ధి పనుల వల్ల పంట దెబ్బతిని దిగాలు పడ్డ రైతులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమంలో అతిధిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మాట్లాడుతూ... "రైతు కంటిపాప లాంటివాడు. నేలతల్లిని సాకే ఆ చేతులు ఎప్పుడూ ఖాళీగా ఉండకూడదు. ఈ గ్రామంలో నష్టపోయిన మిగిలిన ప్రతి ఒక్క రైతుకు కూడా తగిన పరిహారం అందేలా యాజమాన్యం చొరవ చూపాలి" అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్రావు, కర్నాటి రామ్మోహన్రావుతో పాటు జేఈ మహేష్, ఈజేఈ శివ సాగర్, పివిఆర్ ఏజీఎం విజయ భాస్కర్, పివిఆర్ కంపెనీ నిర్వాహకులు భాషా మరియు గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభివృద్ధి పరుగెడుతున్న నేటి సమాజంలో, ఎంతోమంది స్వేద చుక్కల పునాదిపైనే మన ఆకలి తీరుతోంది. యంత్రాలు, పైప్‌లైన్లు, కాంక్రీట్ కట్టడాల కంటే రైతు చెమట బొట్టు చాలా విలువైంది. పంట నష్టపోయిన వేళ వ్యాపార దృక్పథాన్ని పక్కనబెట్టి, మానవీయ కోణంలో ఆలోచించి రైతులకు అండగా నిలవడం ప్రతీ ప్రాజెక్టు యాజమాన్యానికి, ప్రతి పౌరుడికి ఒక గొప్ప ఆదర్శం. రైతులు, కూలీలు, అధికారులు, వ్యాపారులు అందరూ ఒకరికొకరు తోడుగా నిలిచినప్పుడే ఆకలి లేని, ఆనందమయమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

# రాచమళ్ళ కథలు మానవ జీవితానికి దర్పణం

**- కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం...**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మానవ జీవితాన్నీ ప్రతిబింబించేలా రాచమల్ల ఉపేందర్ కథలు దర్పణం పట్టాయని ప్రముఖ సాహితీవేత్త , కాళోజీ అవార్డు గ్రహిత సీతారాం పేర్కొన్నారు. అక్షరాల తోవ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం జెడ్పీ మీటింగ్ హాల్ లో ప్రముఖ రాచమల్ల ఉపేందర్ రచించిన కథల పుస్తకం ఉడికిన మెతుకు, సమీక్షల పుస్తకం అక్షరానుభూతి సంపుటిని ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ. సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సమాజ గమనాన్ని పరిశీలిస్తే అనేక కథలు రాయవచ్చని అన్నారు. రాచమల్ల తన చుట్టూ జరిగే సంఘటనలను విస్తృతంగా పరిశీలిస్తారని, అందుకే అనేక అద్భుతమైన కథలు రాశారని కొనియాడారు... కథా, కవితా రచయితగా, సమీక్షకునిగా, పాటల రచయితగా, గాయకుడిగా అనేక ప్రక్రియల్లో ప్రావీణ్యాన్ని చూపెడుతున్నారని అన్నారు. తొలుత సమీక్షల పుస్తకాన్ని ప్రముఖ బాల సాహిత్యవేత్త పొత్తూరి సీతారామరావు ఆవిష్కరించారు. కథల పుస్తకాన్ని కన్నెగంటి వెంకటయ్య, సమీక్ష పుస్తకాన్ని కొంగ్రు బ్రహ్మం పరిచయం చేశారు. నామా పురుషోత్తం, సయ్యద్ షఫీ అధ్యక్షత వహించిన పుస్తక రచయిత రాచమల్ల ఉపేందర్, ప్రముఖ రచయిత్రి పురిమల్ల సునంద, ప్రముఖ కవులు కోమాకుల సీతారాములు, లెనిన్ శ్రీనివాస్, ములక సురేష్, కపిల రాంకుమార్, కొమ్మవరపు కృష్ణయ్య, యనగందుల దేవయ్య, సిహెచ్ ఆంజనేయులు, అమ్మ ఒడి రత్న మహర్షి, నాగమో హన్, వేము రాములు, గద్దపాటి శ్రీనివాస్, రేళ్ల శ్రీనివా స్, గరిడేపల్లి శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఉపేక్షించేది లేదు

**కాంగ్రెస్ నాయకుడు చాడ తిరుపతి రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్**

**జిల్లా నాయకత్వం ఆదేశాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన మండల అధ్యక్షుడు మల్లారెడ్డి**




**నడికూడ, సెప్టెంబర్ 27,పీసీడబ్ల్యూ న్యూస్ :** పార్టీలో పని చేస్తూ పార్టీకి, ప్రభుత్వ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేసినట్లయితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు పర్నెం మల్లారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు, చర్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చాడా తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల సమయంలో చర్లపల్లి గ్రామంలో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడికి తిరుపతిరెడ్డి వ్యతిరేకంగా ప్రచారం చేసి అతని ఓటమికి కారణమయ్యాడని అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించి అన్ని ఆధారాలు ఉన్నందున తిరుపతిరెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పత్రిక ముఖంగా తెలిపారు. అదేవిధంగా పార్టీలో అతని దురుసుతనం,ప్రభుత్వ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం లాంటి కారణాలతో పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని ఇంకా రెండు గ్రామాల్లో నాయకులు పార్టీకి పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని కానీ సరైన ఆధారాలు లేవని అన్నారు. పార్టీలో ఉంటూ పార్టీ కి వ్యతిరేకంగా పనిచేస్తున్న ఎవరైనా ఉపేక్షించేది లేదని వారిపై పార్టీ పరమైన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు కల్పనా దేవి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రవీందర్ యాదవ్, నడికుడ గ్రామ సర్పంచ్ కుడ్ల మలహాల్ రావు, సదానందం సమ్మయ్య నారాయణ సురేష్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గంగాధరలో యువచైతన్య దీపం కొత్త అడుగు!

**- మండల ఇన్‌చార్జిగా నెల్లి మహేష్ నియామకం..**



**గంగాధర, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** యువచైతన్య దీపం ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విస్తరణలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల ఇన్‌చార్జిగా నెల్లి మహేష్‌ను నియమించారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. గంగాధర మండలంలో సేవా కార్యక్రమాల విస్తరణకు నెల్లి మహేష్ కీలకంగా వ్యవహరించనున్నారు. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఫౌండేషన్ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శేఖర్ సేనాపతి మాట్లాడుతూ సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. నెల్లి మహేష్ నియామకంపై ఫౌండేషన్ సభ్యులు, సేవాభిమానులు అభినందనలు తెలిపారు. 'సేవే మార్గం ప్రేమే లక్ష్యం" అనే నినాదంతో ఫౌండేషన్ తన సేవా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

# రైతు-కూలీ సంక్షేమమే సమాజ ప్రగతి

**శ్రమకు తగ్గ గౌరవం ఇవ్వాలి**

**ఖమ్మం వేదికగా ఏఐకెఎంఎస్ 4వ జాతీయ మహాసభలు**

**28న భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** రైతు, కూలీ సంక్షేమమే సమాజ ప్రగతికి పునాది అని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకెఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు జె.వి. చలపతిరావు, గౌరవ అధ్యక్షుడు వి. కోటేశ్వరరావు అన్నారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మం వేదికగా నిర్వహించనున్న ఏఐకెఎంఎస్ 4వ జాతీయ మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఖమ్మం టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 'వ్యవసాయాన్ని కాపాడండిరైతాంగాన్ని రక్షించండి' అనే నినాదంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 28న మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి భారీ ప్రజా ప్రదర్శన ప్రారంభమై డిగ్రీ కళాశాల వరకు కొనసాగుతుందని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహించనున్నారని, వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ నాయకులు ప్రసంగిస్తారని వెల్లడించారు. 29న ఉదయం జెండా ఆవిష్కరణతో మహాసభలు ప్రారంభమవుతాయని, వివిధ తీర్మానాలు, ఉద్యమ నిర్మాణం, భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించడంతో పాటు నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. రైతు పండించే ప్రతి గింజ వెనుక శ్రమ, కూలీ చెమట వెనుక సమాజ అభివృద్ధి ఉందని నాయకులు పేర్కొన్నారు. శ్రమించే ప్రతి ఒక్కరికీ గౌరవం కల్పించడంతో పాటు రైతు, కూలీ సమస్యలను సమాజం మొత్తం బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలను మీడి యా ప్రతినిధులు కవర్ చేసి ప్రజలకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు యం. భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బందారు ఐలయ్య, జాతీయ కార్యవర్గ సభ్యుడు మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో రౌడీయిజానికి చోటు లేదు

**జెర్రిపోతుల వాసుపై దాడిని ఖండించిన కాంగ్రెస్ నేతలు**






**కరీంనగర్, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** యూత్ కాంగ్రెస్ నాయకుడు, అంబేద్కర్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జెర్రిపోతుల వాసుపై జరిగిన దాడిని ఖండిస్తూ, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శాంతిభద్రతలను కాపాడాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నేతలు ఆదివారం నగర ఏసీపీని కలిశారు. జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ మాట్లాడుతూ.. వాసుపై బీజేపీ నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. కరీంనగర్‌లో రౌడీయిజానికి చోటు లేదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడి చేసిన వారిని బీజేపీ నుంచి సస్పెండ్ చేసి, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెర్రిపోతుల వాసు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమం వద్ద కొందరు తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని ఆరోపించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేసి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పంజాల కృపాసాగర్, సత్తినేని శ్రీకాంత్, గడ్డం శ్రీనివాస్, మంద మహేష్, అంబేద్కర్ సంఘం నాయకులు అరుణ్, పవన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గులాం అహ్మద్ హుస్సేన్ సేవలు అభినందనీయం..

**మొన్న గణేశ్ నిమజ్జనంలో..నేడు సీరత్ ఎక్స్ పో లో వేలాది మందికి మినరల్ వాటర్ పంపిణీ**

**ఎంఐఎం వాటర్ స్టాల్ ను సందర్శించిన సిపి గౌష్ ఆలం, సుడా మాజీ చైర్మన్, జమాతే ఇస్లామీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**







**కరీంనగర్, సెప్టెంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మొన్న వినాయక నిమజ్జనంలో హిందూ సోదరులకు నేడు జమాతీ ఇస్లామీ హింద్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ముస్లిం సోదరులందరికీ, తన సొంత ఖర్చులతో ఎంఐఎం పార్టీ ద్వారా మినరల్ వాటర్ అందిస్తున్న ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులామ్ అహ్మద్ హుస్సేన్ సేవలు అభినందనీయమని, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా వలిఉల్లా సయ్యద్ ఫలాహి, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని మహాత్మ జ్యోతిబాపూలే స్మారక పార్క్, సర్కస్ గ్రౌండ్లో జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎక్స్ పో2026లో, ఎంఐఎం అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ స్టాల్ ను, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కుటుంబ సభ్యుల సమేతంగా వచ్చి సందర్శించారు. పోలీస్ కమిషనర్ కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా స్టాల్ లోకి ఆహ్వానించి, గులామ్ అహ్మద్ హుస్సేన్ శీతలపాలయాలను వారికి అందించారు. సుడా మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలాన వలీవుల్లా సయ్యద్ ఫలాహి మాట్లాడుతూ.. గులాం అహ్మద్ హుస్సేన్ లాంటి సెక్యులర్ భావాలు కలిగిన నాయకుడు, హిందూ ముస్లిం అనే తేడా లేకుండా సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ స్టాల్ ను ఏర్పాటు చేసిన గులాం అహ్మద్ హుస్సేన్ కు, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్, మంకమ్మ తోట డివిజన్ అధ్యక్షుడు ఖైరోద్దీన్ లు కృతజ్ఞతలు తెలిపారు. సిరవ్ ఎక్స్పో 2026 లో తనకు సేవ చేసే భాగ్యం కలిగించినందుకు జమాతే ఇస్లామి హింద్ జిల్లా శాఖకు గులాం అహ్మద్ హుస్సేన్ ప్రతిగా కృతజ్ఞతలు తెలిపారు. గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, రెండు టీంలుగా ఏర్పడి ఎక్స్పోలో ఉన్నటువంటి ప్రతి స్టాల్ ను సందర్శించి, స్టాల్ నిర్వాహకులకు, ఎక్స్ పోకు వచ్చే వేలాది సందర్శకులకు బిస్లరీ వాటర్ బాటిల్ లను స్వయంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సయ్యద్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఆరిఫ్ అహ్మద్, లింగపల్లి శ్రీనివాస్, అబ్దుల్లా ఖాన్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్దుల్ గఫ్ఫార్, సురేశ్, వాజిద్ ఖాన్, ఖాజా మజారోద్దీన్, గాలి రాజు, నాయకులు కింగ్ సాజిద్, మెరాజోద్దీన్, సుల్తాన్ మిర్జా, ఫసియుద్దీన్ ఖాలీద్, ఖమరొద్దీన్ షబ్బీర్, సలీం, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రీల్/వీడియో కాంటెస్ట్



**కడప టౌన్ సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర ప్రాజెక్టును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం రీల్/వీడియో కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 6090 సెకన్ల నిడివి గల వీడియోలను సెప్టెంబర్ 27 నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు సమర్పించాలి. టాప్-5 వీడియోలను సెప్టెంబర్ 30న ఎంపిక చేసి, అక్టోబర్ 1న విజేతలను ప్రకటిస్తారు. ఎంపికైన విజేతలను సుమారు 50,000 మంది పాల్గొనే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చేతుల మీదుగా సన్మానించడంతో పాటు వారి వీడియోలను ప్రదర్శిస్తారు. పోటీదారులు వీడియోలను సోషల్ మీడియాలో @APOfficialNews ఖాతాను ట్యాగ్/కొల్లాబరేట్ చేస్తూ,#Rayala seemaVijayee bhava, #RayalaseemaRising ,#GlobalHorticulture Hub, #PrapanchaUdhyana Kendram, #APOfficialNews హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్టు చేయాలని కలెక్టర్ సూచించారు. రూ.1 లక్ష కోట్ల అంచనా వ్యయంతో 20262029 మధ్య 10 జిల్లాల్లో 201 క్లస్టర్లలో అమలు కానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల హెక్టార్లలో తోటల విస్తరణ, 9.6 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం, 49.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మామిడి, అరటి, టమోటా, దానిమ్మ, ఖర్జూరం, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల ఉత్పత్తి, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రాయలసీమను దేశంలోనే ప్రముఖ ఫ్రూట్ బౌల్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ క్రియేటర్లు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంటెస్ట్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## ప్రధాన అంశాలు, QR కోడ్ ద్వారా స్పందన, 1100 టోల్‌ఫ్రీ వివరాలు ఉండేలా సంక్షిప్తం చేశాను

**- పీజీఆర్ఎస్ సేవలపై QR కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి: కలెక్టర్**



**కడప సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కోరారు. పీజీఆర్ఎస్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన QR కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేసి సేవలు పొందిన వెంటనే తమ స్పందనను నమోదు చేయవచ్చని తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలతో పాటు నోటీసు బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద QR కోడ్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల స్పందనలు అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతాయని, అర్జీల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ అభిప్రాయాలను QR కోడ్ ద్వారా తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు (28వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం




**కడప,సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## ప్రజలకు పారదర్శక పాలన అందించడమే కూటమి లక్ష్యం: మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, సెప్టెంబర్ 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి, మౌలిక వసతులపై దృష్టి సారించిందని చెప్పారు. కృష్ణా డెల్టాకు సాగునీటి కొరత లేకుండా ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో మరో రెండు బ్యారేజీల నిర్మాణాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మచిలీపట్నం పోర్టు అభివృద్ధితో పాటు అనుబంధ పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 3 వేల ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు పంపించామని, డ్రైనేజీ, రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం అభివృద్ధి, డ్రైనేజీ, మౌలిక వసతులపై తగినంత దృష్టి పెట్టలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ నియామకాలు, క్రీడా ధ్రువపత్రాలపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు మంత్రి స్పందిస్తూ, గతంలో జారీ చేసిన ధ్రువపత్రాల ఆధారంగా ఉద్యోగాలు పొందుతున్న వారిపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గత ఐదేళ్లలో మచిలీపట్నానికి తీసుకొచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించాలని కోరారు.

# ఐపీఎల్ ఫ్యాన్స్ కు బిగ్ సర్ప్రైజ్.. చెన్నై సూపర్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఞూా) చరిత్రలో భారీ పాపులారిటీ ఉన్న జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 2027 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, భారత మాజీ పేస్ దిగ్గజం జహీర్ ఖాన్ (ఖప్త్రవవతీ ఖష్ట్రుఅ)ను తమ జట్టుకు కొత్త హెడ్ కోచ్(ఎముఙ జశ్ఖుఎష్ట్ర)గా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత అనేక సంవత్సరాలుగా సీఎస్‌కే జట్టుకు కోచ్‌గా సేవలందించి, జట్టును ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ (స్రవజూష్త్రవఅ ఖీశ్రీవఎఱఅష్ట్ర) స్థానంలో జహీర్ ఖాన్ ఈ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.దాదాపు 19 సంవత్సరాల పాటు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో విడదీయరాని బంధాన్ని కొనసాగించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్, ఇటీవల తన పదవికి వీడ్కోలు పలికారు. గత సీజన్లలో జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం, అలాగే ఆయన ఇంగ్లాండ్ పురుషుల టెస్ట్ జట్టుకు హెచ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి నిర్ణయించుకోవడంతో ఈ మార్పు జరిగిందని తెలుస్తోంది. ఫ్లెమింగ్ లాంటి దిగ్గజ కోచ్ తప్పుకోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన వ్యక్తి కోసం వెతికిన సీఎస్‌కే యాజమాన్యం, అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవమున్న జహీర్ ఖాన్ వైపు మొగ్గు చూపింది.

2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న జహీర్ ఖాన్, గతంలో ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు మెంటార్‌గా, కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా పనిచేసిన అపార అనుభవం కలిగి ఉన్నారు. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ (మీా ఇష్ట్రశీఅఱ) కెప్టెన్సీలో జహీర్ అంతర్జాతీయ క్రికెట్ ఆడటం వల్ల, ధోనీతో ఆయనకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ కారణంగానే సీఎస్‌కే జట్టులో జహీర్ నియామకం వెనుక ధోనీ సిఫారసు కూడా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, సీఎస్‌కే ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో జహీర్ ఖాన్ వ్యూహాలు జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడంలో ఎంతవరకు సఫలమవుతాయనేది ఆసక్తికరంగా మారింది.

గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో

# హోమ్ లోన్ జం ప్రాపర్టీ లోన్.. మీకు ఏది బెస్ట్..? ఈ చిన్న తప్పులతో జేబుకు చిల్లే..!




మనిషి జీవితంలో ఆర్థిక భద్రతను నిర్మించుకోవడంలో స్థిరాస్తుల కొనుగోలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికో లేదా ఇప్పటికే ఉన్న ఆస్తుల విలువ ఆధారంగా తక్షణ అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులు ప్రధానంగా రెండు రకాల లోన్ సౌకర్యాలను అందిస్తున్నాయి. అవే హోమ్ లోన్, ప్రాపర్టీ లోన్. ఈ రెండింటి నిబంధనలు పూర్తిగా వేర్వేరు కాబట్టి మీ ప్రస్తుత అవసరానికి తగినదాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. హోమ్ లోన్ అనేది కొత్తగా ఒక ఇంటిని, ప్లాట్‌ను కొనడానికి లేదా సొంత స్థలంలో నూతన ఇళ్లు నిర్మించుకోవడానికి మాత్రమే బ్యాంకులు మంజూరు చేసే లోన్. దీనిని పొందడానికి దరఖాస్తుదారుడికి మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో పాటు లోన్ సకాలంలో చెల్లించగల స్థిరమైన ఆదాయం ఉండటం తప్పనిసరి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా హోమ్ లోన్లకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో పాటు 20 నుంచి 30 సంవత్సరాల వరకు సుదీర్ఘ కాలవ్యవధిలో రీపేమెంట్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. మరోవైపు ఆస్తిపై లోన్ అనేది ఇప్పటికే మీ పేరిట ఉన్న నివాస లేదా వాణిజ్య స్థలాన్ని బ్యాంకు వద్ద తాకట్టు పెట్టి నగదు పొందే పద్ధతి. ఇందులో వచ్చే నిధులను ఇంటి నిర్మాణానికే కాకుండా వ్యాపార విస్తరణ, ఉన్నత చదువులు, వివాహ ఖర్చులు లేదా అత్యవసర వైద్య ఖర్చుల వంటి ఏ అవసరానికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ లోన్‌లో మీ ఆస్తి మార్కెట్ విలువను బట్టి మాత్రమే డబ్బులు వస్తాయి. ఉదాహరణకు మీ ఆస్తి విలువ రూ.1 కోటి ఉంటే బ్యాంకు రూల్స్ ప్రకారం రూ.

50 లక్షల నుండి రూ. 70 లక్షల వరకే లోన్ లభిస్తుంది తప్ప పూర్తి కోటి రూపాయలు ఇవ్వరు.

ఈ రెండింటిలో ఏది మీకు సరైనదో తేల్చుకోవడానికి మీ అవసరమే గీటురాయి. మీరు కొత్తగా ఇంటిని తీసుకోవడం లేదా సొంత స్థలంలో కట్టుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే లభించే హోమ్ లోన్ బెస్ట్ ఆప్షన్. అలా కాకుండా ఇప్పటికే మీ వద్ద ఉన్న ఫ్లాట్ లేదా ఖాళీ స్థలాన్ని ఉపయోగించి కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా, లేదా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైనా దాన్నిపై లోన్ తీసుకోవడం సరైన అవుతుంది.

# హెచ్‌సీఏ మహిళల అండర్-19 టీ20 టోర్నీకి రంగం సిద్ధం



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్మహిళల అండర్- విభాగంలో నిర్వహించనున్న టీ20 సూపర్ లీగ్టోర్నీకి సంబంధించి మొత్తం ఎనిమిది జట్లను మంగళవారం అధికారికంగా వెల్లడించింది. క్రికెట్‌లో అత్యంత పొట్టి ఫార్మాట్‌లో వర్ధమాన మహిళా క్రికెటర్ల సత్తా చాటేందుకు ఈ లీగ్ వేదిక కానుంది. యువ క్రీడాకారిణులకు నాణ్యమైన మ్యాచ్ అనుభవం కల్పించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించే లక్ష్యంతో ఈ జట్లను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అమ్మాయిలకు ఈ జట్లలో చోటు దక్కింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు భవిష్యత్తులో ఉన్నత స్థాయి అవకాశాలు దక్కే వీలుంది.జట్ల వివరాల్లోకి వెళితే, టీమ్ ఏం జట్టుకు కమ్మిలి నిధి) కెప్టెన్, వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో సి.దీక్షిత, జాజ్మిన్ గిల్, బి.కీర్తన, అక్షర గుండు, కె.అర్పిత, దృవిజ్ఞ, అల్లం సృష్టి, సిమ్రాన్ యాదవ్, శ్రీజ, మిద్దెల లికిల (నల్గొండ), ముదావత్ సింధుజ ఎంపికయ్యారు.టీమ్ బిం బృందానికి జి.కావ్య శ్రీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, నందిగామ అక్షయ, ఆదిమూలం హాసిని, బి.గీతిక ప్రియదర్శిని, వేముల జెనిక్ష, ఆయిషా షేక్, తూము అనన్య, రుక్సార్, ప్రవళిక, తలారి సంసిత, పన్యాల సహస్ర, ప్రణవి సభ్యులుగా ఉన్నారు.టీమ్ సిం జట్టుకు కట్టా తేజస్విని సారథ్యం వహిస్తుండగా, ప్రతీక కంచర్ల, ఎడ్ల దర్శిని, లింగంపల్లి లక్ష్మి సహస్ర, జి.హేష్మిత శ్రీ, సుప్రీత, బుక్య శారద, నక్కా నిధి కృష్ణ, మేఘన గౌడ్, పట్టిక షాన్వి, సామల చిద్విలాసిని, అంకెనగారి సుచరిత స్థానం సంపాదించారు.టీమ్ డిం జట్టుకు ఎం.శ్రీ గ్రంథ నాయకత్వం వహిస్తున్నారు. ఇందులో ఆర్.లలిత, సజ్జా నాగ శ్రీ చరిత, ఎన్.నీతా శాశ్వత, ప్రతీక, టి.జాహ్నవి, పి.తనుషిక, కె.సహస్ర, ఝాన్సీ, లకవత్ చైతన్య, కన్నం శ్రేయ, సోనాలి ఆడనున్నారు.టీమ్ ఈం జట్టు పగ్గాలను ఎం.చార్వి లక్ష్మి శ్రీ అందుకోగా, వై.ఈశ్వరి, ఎం.అక్షిత గౌడ్, సాయి తనుశ్రీ, స్వాగతిక పాండ, సి.నాగ రూపిణి, పోలమ శ్రీవాస్తవ, పెవల్ తనీష, ముత్యాల అనిక, వానరాసి ప్రసన్న, సి.జయ కాత్యాయని, బుచ్చి హాసిని ఉన్నారు.మిగిలిన జట్లలో టీమ్ ఎఫ్ం జట్టుకు ఎన్.బబిత ఫ్టైన్‌గా ఉండనున్నారు. సి.నాగసాయి అక్షిత, బొక్క దీప్షిక, డి.అనన్య, టి.హర్షిణి, వూర్క రిషిమ, డి.నిష్ట, ధరావత్ రిషిక, ఇ.గౌతమి, పూర్వ లాహోటి, నవురు సంజన, ఎ.జుచితా రెడ్డి జట్టులో చోటు దక్కించుకున్నారు.టీమ్ జిం బృందాన్ని ప్రతీక్ష వెంకటేషనడిపించనుండగా, శరగూడం మిత్ర, పి.బంధన, హీరల్ జోషి, ధరావత్ శ్రావణి, యమున, అక్కీ ఆశ్రిత, ఆస్థా శర్మ, సముద్రాల ఇనాయ, శ్రీ సహస్ర రాజ్, డి.ప్రణవి, ఉదయ చంద్రిక బరిలోకి దిగుతారు.ఇక టీమ్ హెచ్ం జట్టుకు పి.అక్షయ రెడ్డి ( సారథిగా వ్యవహరించనున్నారు. ప్రాచీ యాదవ్, వి.నికేషిణి, ఎల్.శ్రుతిక, కె.అనేరా శాంత్, స్రవంతి, నిత్యశ్రీ, నెల్లుట్ల అక్షయ, కొడిగంటి మనీషా, డివిఎస్ఎం శ్రీ రెణ్య, పప్పు కీర్తన, హరిణి ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈ యువ ప్లేయర్లు తమ ప్రతిభతో లీగ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ డేట్స్ వచ్చేశాయ్.. డిస్కౌంట్లు చూస్తే నోరెళ్లాబెట్టాల్సిందే..




ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ డేట్స్ వచ్చేశాయి. ఈ మెగా సేల్ అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను లైవ్ చేస్తూ, బ్యాంక్ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల వివరాలను వెల్లడించింది. సాధారణ యూజర్ల కంటే ఒక రోజు ముందుగానే ప్లస్ మెంబర్స్‌కు ఈ సేల్ అందుబాటులోకి రానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ , ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు ఈ 24 గంటల ఎర్లీ యాక్సెస్ లభిస్తుంది. ప్రధాన సేల్ ప్రారంభం కాకముందే పరిమిత స్టాక్ ఉండే హాట్ డీల్స్‌ను దక్కించుకునే అవకాశం వీరికి దక్కుతుంది.బ్యాంక్ ఆఫర్లు -- క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు మైక్రోసైట్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం కస్టమర్లకు భారీ ఆర్థిక రాయితీలు లభించనున్నాయి.తక్షణ డిస్కౌంట్: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లపై గరిష్ఠంగా 10శాతం తక్షణ తగ్గింపు లభిస్తుందిఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ఈ కార్డు వినియోగదారులు అదనంగా 10 శాతం వరకు పొదుపు చేయవచ్చు.సూపర్ మనీ : మొదటి లావాదేవీపై 10శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నారు.యూపీఐ, ఇతర ప్రముఖ పేమెంట్ గేట్‌వేల ద్వారా చెల్లింపులు జరిపే వారికి సైతం ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు ఉంటాయని సంస్థ తెలిపింది.ఏయే భాగాల్లో భారీ తగ్గింపులు?నిర్దిష్ట ఉత్పత్తుల వారీగా ఇంకా ధరలను అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లైయన్స్‌పై భారీ తగ్గింపులు ఉండనున్నట్లు స్పష్టమైంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పీసీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఆడియో డివైజ్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ హోమ్ అప్లయన్సెస్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్ ఉండనున్నాయి.ఐఫోన్, శాంసంగ్ డీల్‌కొత్త మొబైల్ కొనాలనుకునే వారికి బిగ్ బిలియన్ డేస్ సేల్ అత్యుత్తమ వేదిక కానుంది.ఆపిల్ ఐఫోన్లు: ఇటీవల ఆపిల్ కొత్త ఐఫోన్ 18 ప్రో సిరీస్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో మునుపటి మోడళ్లయిన ఐఫోన్ 16, ఐఫోన్ 17 సిరీస్‌లపై అదిరిపోయే ప్రైస్ కట్స్ వచ్చే అవకాశం ఉంది.శాంసంగ్ గెలాక్సీ: శాంసంగ్ ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ధరల తగ్గింపు ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల కొరత నెలకొన్నందున కొన్ని ఫోన్ల లభ్యత, తుది ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది.సేల్ ప్రారంభ సమయం దగ్గరపడే కొద్దీ నిర్దిష్ట ప్రోడక్ట్ డీల్స్‌ను ఫ్లిప్‌కార్ట్ ఒక్కొక్కటిగా రివీల్ చేయనుంది. పండుగ సీజన్ షాపింగ్ కోసం వినియోగదారులు ఇప్పటి నుంచే తమ విష్‌లిస్ట్‌లను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# విండీస్‌తో తొలి వన్డే.. బ్రేక్ కానున్న 3 భారీ రికార్డులు..




భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక వన్డే సిరీస్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ ద్వారా భారత్‌లో హోమ్ సీజన్ కూడా మొదలుకానుంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ సీనియర్ ఆల్ రౌండర్ జెసన్ హోల్డర్ ప్రముఖ మీడియాతో మాట్లాడుతూ భారత జట్టుపై, ముఖ్యంగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, యువ కెప్టెన్ శుభమన్ గిల్ గురించి తన మనసులోని మాటలను పంచుకున్నారు. ప్రపంచ క్రికెట్‌లో ఈ దిగ్గజాల పాత్ర ఎంత కీలకమో ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

శుభమన్ గిల్ కెప్టెన్సీపై హోల్డర్ ప్రశంసలు

ఐపీఎల్‌లో శుభమన్ గిల్ కెప్టెన్సీలో ఆడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ జెసన్ హోల్డర్ తన నాయకత్వ లక్షణాలను కొనియాడారు. గిల్ చాలా ప్రశాంతంగా ఉంటాడని, ఎక్కడా ఆందోళన చెందకుండా స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తాడని తెలిపారు. మైదానంలో బౌలర్లకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ, వారిని నమ్ముకుని ఫీల్డ్ సెట్ చేసుకునే అవకాశమిస్తాడని హోల్డర్ వెల్లడించారు. గిల్ ఇంకా యువ కెప్టెన్ అయినప్పటికీ, మ్యాచ్‌లు ఆడుతూ ఎంతో వేగంగా నేర్చుకుంటున్నాడని, భవిష్యత్తులో అతను మరింత గొప్ప నాయకుడిగా ఎదుగుతాడని ప్రశంసించారు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ఏమన్నారంటే

భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల గురించి మాట్లాడుతూ జెసన్ హోల్డర్ ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. విరాట్ కోహ్లీ బహుశా వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ అని, అతన్ని మైదానంలో చూడటమే ఒక అద్భుతమని కొనియాడారు. అలాగే రోహిత్ శర్మకు కూడా వన్డేల్లో అద్భుతమైన రికార్డు ఉందని, ముఖ్యంగా వెస్టిండీస్ జట్టుపై అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాడని గుర్తుచేశారు. ఈ ఇద్దరు లెజెండ్స్‌తో తలపడటం ఏ బౌలర్‌కైనా సవాల్‌తో కూడుకున్న విషయమేనని, అలాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీ పడటాన్ని తాను ఎప్పుడూ ఆస్వాదిస్తానని హోల్డర్ చెప్పారు.

గుర్నూర్ బ్రార్ పై ప్రశంసలు


ఇదే ఇంటర్వ్యూలో గుజరాత్ టైటాన్స్ జట్టులో తాను దగ్గరగా చూసిన యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ప్రతిభను హోల్డర్ ఎంతగానో మెచ్చుకున్నారు. బ్రార్ వద్ద అద్భుతమైన వేగంతో పాటు మంచి బౌన్సీ డెలివరీలు ఇచ్చే ఎత్తు ఉందని, అతనికి భవిష్యత్తులో గొప్ప కెరీర్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రాబోయే వన్డే సిరీస్ ఇటు వెస్టిండీస్ జట్టుకు, అటు టీమిండియాకు ఎంతో కీలకమని, ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీ పోరు సాగుతుందని ఆయన అంచనా వేశారు.

# పడిపోతున్న బంగారం, వెండి ధరలు.. రెండు రోజుల్లో ఎంత తగ్గిందంటే..



బంగారం కొనేందుకు సిద్ధమవుతున్న వారికి శుభవార్త. ఇటీవల గోల్డ్ రేటు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో శని, శుక్రవారాల్లోనూ ధర భారీగా పెరిగింది. అయితే, ఇవాళ మాత్రం గోల్డ్ రేటు కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే గత రెండు రోజుల్లో సుమారు వెయ్యి రూపాయల వరకు దిగి వచ్చింది.ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉన్నాయి. అయితే, బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి నాటికి బంగారం గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి, 10 గ్రాములకు రూ.1.80 లక్షలను దాటవచ్చని కూడా వారు పేర్కొంటున్నారు.తాజాగా మంగళవారం (సెప్టెంబర్ 22) దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. అయితే ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ప్రధాన నగరాల్లో ధరల వివరాలు.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర వద్ద కొనసాగుతోంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,720 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,840 వద్ద కొనసాగుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. ప్రస్తుతం కిలో గ్రాము వెండి ధర రూ.2,49,900 వద్ద ట్రేడవుతోంది.

# కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం.. ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ

ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో

# పార్యడైజ్ సినిమా చూసిన కేటీఆర్.. కేసీఆర్ పాత్ర గురించి ఏమన్నారంటే



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది పారడైజ్' సినిమాను పార్టీ సభ్యులతో కలిసి వీక్షించారు కేటీఆర్ . చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూశానని ఎక్స్‌లో వెల్లడించారు. సినిమా చాలా బాగుందని, దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారని, నాని నటన ఆకట్టుకుందని కేటీఆర్ ప్రశంసించారు. ఎమ్మెల్యే శంకరన్న పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఆ పాత్ర స్ఫూర్తి ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కేటీఆర్ రాకతో థియేటర్ వద్ద అభిమానులు, ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చినట్లు ఎక్స్ ( ట్విట్టర్) ద్వారా వెల్లడించిన కేటీఆర్.నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన "ది పారడైజ్" చిత్రాన్ని చూశారు కేటీఆర్. తనకు ఇష్టమైన నటుడు నాని సినిమాను చూసేందుకు శనివారం రాత్రి థియేటర్‌కు వెళ్లారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. సినిమాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హావభావాలు, స్టైలింగ్‌ను పోలి ఉండే "శంకరన్న" (ప్రియదర్శి) పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేటీఆర్ రాకతో థియేటర్ ఆవరణకు భారీగా ప్రేక్షకులు, అభిమానులు చేరుకున్నారు. .సినిమా చూసిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ.. ది పారడైజ్ సినిమా చాలా బాగుంది. సామాజిక అంశాన్ని బలంగా తెరపై ఆవిష్కరించారు. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. కథ, పాత్రలు, సన్నివేశాలను ప్రభావవంతంగా చూపించారు. నాని అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. పాత్రకు పూర్తిగా న్యాయం చేశారని కేటీఆర్ అన్నారు. అలాగే మీరూ శంకరన్న పాత్ర ప్రత్యేక ఆకర్షణ, ఆ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలోని సామాజిక అంశాలు, పాత్రల సంఘర్షణ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయని అన్నారు కేటీఆర్. అభినందించారు.

# ఆ కండిషన్‌తోనే బిగ్ బాస్ కు వెళ్ళా.. ఒక్క రూపాయి కూడా రాలేదు.



బాలీవుడ్‌లో తన డాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా ఫతేహి.. ప్రస్తుతం భారతీయ సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. కెనడాకు చెందిన ఈ ముద్దుగుమ్మ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్, సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే నేడు స్టార్‌గా కొనసాగుతున్న నోరా ప్రయాణం అంత సులభంగా సాగలేదు. కెరీర్ ప్రారంభంలో ఆర్థిక ఇబ్బందులు, అవకాశాల కోసం ఎదురుచూపులు, పారితోషికం చెల్లింపుల విషయంలో ఎదురైన సమస్యలను ఆమె స్వయంగా వెల్లడించారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.తొలినాళ్లలో రియాలిటీ షోలపై తనకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదని నోరా వెల్లడించారు. అందుకే బిగ్ బాస్ నిర్వాహకులు సంప్రదించినప్పుడు మొదట తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించానని చెప్పారు. అయితే షో ద్వారా లభించే పారితోషికం గురించి తెలుసుకున్న తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు నోరా తెలిపారు. అదే సమయంలో బిగ్ బాస్ వంటి భారీ

# బిగ్‌బాస్ 10 మూడో వారం ఎలిమినేషన్ ఊహించని కంటెస్టెంట్ బయటకు నిరాశలో ఫ్యాన్స్



బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ఆసక్తికరంగా, రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే ఈ సీజన్ లో విజయవంతంగా రెండు వారాలు పూర్తయ్యాయి. ఇప్పుడు మూడో వారం కూడా ఎండింగ్ కు వచ్చేసింది. దీంతో ఎప్పటిలాగే ఎలిమినేషన్ ఎవరన్నది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే వీకెండ్ ఎపిసోడ్స్ లో భాగంగా నాగార్జున ఎంట్రీ ఇచ్చి కంటెస్టెంట్లతో మాట్లాడుతున్నారు. తప్పులు చేసిన వారితో తనదైన శైలిలో ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మూడో వారం ఎవరు బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు చాలా మంది ఓటింగ్ లో అట్టడుగున ఉన్న యాంకర్ వర్షిణీ హౌస్ నుంచి బయటకు వస్తుందనుకుంటున్నారు. అయితే ఇక్కడే ఓ ట్విస్ట్ ఇచ్చాడు బిగ్ బాస్. ఎవరూ ఊహించని విధంగా ఓ టాప్ మేల్ కంటెస్టెంట్ బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయ్యి బయటకు రానున్నాడని సమాచారం. మూడో వారం ఎలిమినేషన్స్ కు సంబంధించి బిగ్ బాస్ 10 నామినేషన్స్ లో త్రిగుణ్, సుధీర్ రెడ్డి, అమన్, చరణ్, వంశీ, షాలిని, వర్షిణి, సింగర్ ఝాన్సీ ఉన్నారు. ప్రస్తుతమున్న ఓటింగ్ ట్రెండస్ ప్రకారం త్రిగుణ్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఎవరూ ఊహించని విధంగా గత రెండు వారాలు బాటమ్ లో ఉన్న సుధీర్ రెడ్డి ఇప్పుడు ఏకంగా టాప్ 2కి దూసుకొచ్చాడు. ఇక చరణ్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక టాప్-4 ప్లేస్ లో అమన్ ఉండగా, వంశీ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆరో ప్లేస్ లో వర్షిణీ ఉండగా, ఏడో ప్లేసులో షాలినీ, ఎనిమిదో స్థానంలో సింగర్ ఝాన్సీ ఉన్నారు. అయితే సింగర్ ఝాన్సీకి సోషల్ మీడియాలోనూ ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. పైగా ఆమెకు రైతు బిడ్డ ట్యాగ్ కూడా ఉంది. దీంతో ఆమె ఎలిమినేట్ అయ్యే ఛాన్స్ లేదు. ఇక షాలినీ కూడా గేమ్ బాగా ఆడుతోంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు మంచి సపోర్ట్ ఉంటోంది. ఇక మిగిలింది యాంకర్ వర్షిణీ, టెంపర్ వంశీ. ప్రస్తుతం వీరిద్దరి మధ్యనే ఎలిమినేషన్ ప్రాసెస్ జరుగుతోంది.

# నాని 'ది ప్యారడైజ్' సక్సెస్ మీట్.. మరోసారి గొప్ప మనసు చాటుకున్న మోహన్ బాబు




ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 'ది ప్యారడైజ్' సినిమా ఫీవర్ నడుస్తోంది. ఎక్కడ చూసినా ఈ సినిమా పేరే వినిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అయితే ఈ మూవీ పేరు తెగ మార్మోగుతుంది. స్వయంగా మాజీ మంత్రి, బీఆర్ ఎస్ అగ్రనేత కేటీఆర్ సైతం ది ప్యారడైజ్ సినిమాను చూసేందుకు థియేటర్ కు వెళు తున్నాననడం ఆసక్తికరంగా మారింది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో జడల్ అనే పాత్రలో నాని అదరగొట్టాడు. హీరోయిన్ గా కయాదు లోహర్ అందంగా కనిపించింది. ఇక శికంజా మాలిక్ అనే క్రూరమైన విలన్ పాత్రలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు అదరగొట్టారు. కొన్ని సీన్లలో అయితే మోహన్ బాబు నట విశ్వరూపం చూపించారని క్రిటిక్స్ చెబుతున్నారు. ఇక సినిమాకు మొదటి రోజే మిక్స్ డ్ టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్రం ఓ రేంజ్ లో వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు రెండు రోజుల్లో కలిపి రూ. 114 కోట్ల వసూళ్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది .ఈ నేపథ్యంలో ది ప్యారడైజ్ చిత్ర బృందం శనివారం (సెప్టెంబర్ 26) సక్సెస్ మీట్ నిర్వహించింది. నాని, శ్రీకాంత్ ఓదెల, మోహన్ బాబుతో సహా చిత్ర బృందమంతా ఈ కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా మాట్లాడిన మోహన్ బాబు చాలా ఎమోషనల్ అయ్యారు.ఈ సందర్భంగా తనకు తమ్ముడిలాంటి గద్దర్‌ను గుర్తుచేసుకున్నారు మోహన్ బాబు. గద్దర్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని చెబుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నాకు తమ్ముడి లాంటి వారు గద్దర్. ఆయన పిల్లలు మా స్కూల్‌లోనే చదువుకున్నారు. రచయితలు అంటే నాకు చాలా ఇష్టం' అని ఎమోషనల్ అయ్యారాయన. ఈ సందర్భంగా ఓ రచయిత మృతి చెందిన విషయం తనకు తెలిసిందని గుర్తుచేసుకున్న మోహన్‌బాబు.. ఆయన కుమారుడిని వేదికపైకి పిలిపించి మాట్లాడారు. అతడు ప్రస్తుతం ఏం చదువుతున్నాడని అడిగారు. ఫార్మసీ చదువుతున్నానని అతడు చెప్పడంతో.. "మా దగ్గర ఎం.ఫార్మసీ కూడా ఉంది" అని మోహన్‌బాబు తెలిపారు.ఇదే వేదికగా అతడికి రెండు సంవత్సరాల పాటు ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు మోహన్ బాబు. 'నువ్వు బాగా చదువుకుని గొప్పవాడివి అవ్వాలి" అంటూ సదరు విద్యార్థిని ఆశీర్వదించారు.ది ప్యారడైజ్ సక్సెస్ మీట్ వేదికగా మోహన్‌బాబు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పైకి గంభీరంగా కనిపించినా మోహన్ బాబు చాలా మంచి వారని, ఆయన విద్యకు చాలా ప్రాధాన్యమిస్తారని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పుడు ఒక విద్యార్థికి ఉచిత విద్య ప్రసాదించడం ద్వారా మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారని కామెంట్స్ చేస్తున్నారు.

# నాని 'ది ప్యారడైజ్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా



నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ది ప్యారడైజ్ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతోంది. మొదటి షోకే మిక్స్ డ్ టాక్ వచ్చినప్పటికీ ఈ సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా రెండు రోజులకు కలిపి ఏకంగా 114 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నాని జడల్ అనే పాత్రలో అద్భుతంగా నటించాడు. అలాగే హీరోయిన్ గా కయాదు లోహర్ సుబ్బు అనే పాత్రలో క్యూట్ గా కనిపించింది. వీరితో పాటు మోహన్ బాబు, రాఘవ్ జుయెల్, సంపూర్ణేష్ బాబు, సోనాల్ కులకర్ణి తదితరులు ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషించారు. ఇదిలా ఉంటే రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోన్న ది ప్యారడైజ్ సినిమా గురించి ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే.. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం ముందుగా కయాదు లోహర్ ను ఎంపిక చేయలేదట. వేరొ స్టార్ హీరోయిన్ ఈ సినిమాని రిజెక్ట్ చేయడంతో తిరిగి చిత్ర నిర్మాతలు కయాదును ఎంపిక చేశారని తెలుస్తోంది. మరి మొదటగా సుబ్బు పాత్ర కోసం దర్శక నిర్మాతలు అనుకున్న స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?దేవర సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయమైంది బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ జాన్వీ కపూర్. ఈ సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న ఆమె రామ్ చరణ్ పెద్ది సినిమా చేసింది. అయితే పెద్దితో పాటు ది ప్యారడైజ్ సినిమా కోసం కూడా జాన్వీని సంప్రదించారు మేకర్స్. అయితే అప్పటికే పెద్ది సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడంతో జాన్వీ కపూర్ నాని ది ప్యారడైజ్ సినిమాను వదులుకుందని తెలుస్తోంది. దీంతో దర్శక నిర్మాతలు సుబ్బు పాత్ర కోసం కయాదు లోహర్ ఎంపిక చేశారని తెలుస్తోంది. అయితే ది ప్యారడైజ్ సినిమాలో కయాదు రోల్ కు పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వలేదన్న టాక్ వినిపిస్తోంది. మరి ఒక వేళ జాన్వీ గనక ఈ రోల్ చేసి ఉంటే సినిమా రిజల్ట్ ఎలా ఉండేదోనని సినీ అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు.ది ప్యారడైజ్ సినిమా విషయానికి వస్తే.. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ (ఎస్ఎల్‌వి సినిమాస్) బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ మూవీని నిర్మించారు. అనిరుధ్ ఈ మూవీకి స్వరాలు సమకూర్చారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లోనూ ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది.